క్లుప్తంగా

వైద్యశిబిరం



నల్లబెల్లి: నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక మహాత్మగాంధీ కాలనీలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా నల్లబెల్లి వైద్యాధికారి ఆచార్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విషజ్వరాలపై ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, హెల్త్ సూపర్ వైజర్ హెబ్సిబా, హెల్త్ అసిస్టెంట్ కిషన్, ఏఎన్ఎం మాధవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



చెన్నారావుపేట: మండల స్థాయి క్రీడోత్సవాల్లో సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులను అభినందించారు. గత నెల 29, 30 తేదీల్లో సూరుపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాల్లో కబడ్డీ సీనియర్ విభాగంలో అండర్-17, జూనియర్ విభాగంలో అండర్-14లో ప్రథమ బహుమతి సాధించారన్నారు. నర్సంపేటలో నిర్వహించే డివిజన్ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, పీఈటీలు పొన్నం రమేష్, ఆరె రాజు, అల్లం లేని రవికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'అరూరి' గెలుపునకు తీర్మానం



పర్వతగిరి: రాబోయే ఎన్నికల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అరూరి రమేష్‌ను మరోసారి గెలిపించేందుకు కృషి చేస్తామని చింతనెక్కొండ పద్మశాలి కులస్తులు మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గటిక సుష్మమహేష్, ఉపసర్పంచ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు తాశంశెట్టి రఘు, కార్యదర్శి జీడి ప్రసాద్, జీడి గట్టయ్యకు వారు మంగళవారం తీర్మాన పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అరూరి రమేష్ గెలుపు కోసం పాటుపడతామని పేర్కొన్నారు.

'పాలకుర్తి నుంచి బరిలో ఉంటా..'

రాయపర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ నుంచి తనకే టికెట్ వస్తుందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ ఓబీసీ ఇన్‌చార్జి ఉల్లెంగుల యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ హోదాల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. ఐనవోలు మల్లికార్జున స్వామి ట్రస్ట్ బోర్డు, సికింద్రాబాద్ రైల్వే డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ మెంబర్‌గా, అఖిల భారతీయ ధోబీ మహాసమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా సేవలు అందించినట్లు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



దామెర: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే మంచి ర్యాంకులు సాధిస్తారని సామాజికవేత్త డాక్టర్ పురాణం వెంకట్‌రాములు అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు మోటివేషనల్ స్కిల్స్‌ను వివరించారు. అలాగే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇష్టపడి చదివినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆత్మవిశ్వాసంతో లక్ష్యసాధనకు కృషిచేయాలన్నారు. పట్టుదల, కృషి ఉంటే విజయం వెంటే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, విజిలెన్స్ అధికారులు పాషా, అమ్జద్‌అలీ, అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటును వృథా చేయొద్దు

దామెర: ఓటును వృథా చేయొద్దని ఏపీడీ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఓటుహక్కు, స్వచ్ఛతాహీ సేవ, సిటిజన్‌ఆప్‌పై మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

20శాతం ఐఆర్ ప్రకటించాలి



రాయపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

రాయపర్తి: రాష్ట్ర ప్రభుత్వం 20శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం 5శాతం ఐఆర్‌ను ప్రకటించడం, పెండింగ్ డీఏలు ప్రకటించకపోవడం, వివిధ రకాల పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డీఏలు, మెడికల్ బిల్లులు, పీఆర్సీ ఎరియర్స్, ఇతర ఆర్థిక బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకుడు గారె కృష్ణమూర్తి, సతీష్‌కుమార్, శ్రీధర్, వెంకన్న, పాక పద్మావతి, మమత, సునీత, రోజారాణి, రావుల భాస్కర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిపై నిరసన

చెన్నారావుపేట: ప్రభుత్వం ప్రకటించిన అతి తక్కువ ఐఆర్(మధ్యంతర భృతి)ని ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ భాగస్వామ్య సంఘాల సభ్యులు డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంగోతు భద్రయ్య, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శి అయ్యూబ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉపాధ్యాయులు భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా కేవలం 5శాతం మధ్యంతర భృతి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. యాకయ్య, కొంరయ్య, రవి, ఉమాశంకర్, కట్టస్వామి, వెంకటయ్య, మంజుల, ఝాన్సీ, రోజారాణి, సాంబయ్య, వీరన్న, నర్సయ్య ఉన్నారు.

పీఆర్సీ కమిటీ ఏర్పాటు స్వాగతిస్తున్నాం

పర్వతగిరి: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీని నియమించడాన్ని స్వాగతిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ పర్వతగిరి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాక శ్రీనివాస్, గుండు కరుణాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కమిటీ నివేదికను ఆరు నెలల్లో తెప్పించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మధ్యంతర భృతి(ఐఆర్) కేవలం ఐదు శాతం మాత్రమే ప్రకటించడం ఉపాధ్యాయ, ఉద్యోగుల ఊహకందని అంశంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘాలతో చర్చలు జరపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం అన్నారు.

బంగారు తెలంగాణలో ఉద్యోగుల జీవితాలు బాగుపరచాలని, ఇప్పటికైనా పది శాతం నుంచి 15శాతం ఐఆర్ ఇచ్చి గత పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న రెండు డీఏలు వెంటనే విడుదల చేయాలని, ట్రెజరీల్లో ఆమోదం పొంది ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే క్లియర్ చేయాలని కోరారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రమోషన్స్, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాగసుధ

నర్సంపేట: పాలకుల విధానాలతో దోపిడీకి గురవుతున్న అట్టడుగు వర్గాలు, సామాజిక శక్తులను కలిపి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని బీఎల్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ వంగల రాగసుధ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో మంగళవారం బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం అల్లిసాబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాలకుల విధానాల మూలంగా వివక్షతకు గురవుతున్నారన్నారు. బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, కేసీఆర్ ప్రభుత్వాల విధానాలు కార్మిక, కర్షక, కూలీల శ్రమను కొల్లగొట్టేలా కొనసాగుతున్నాయని విమర్శించారు. ప్రజలందరినీ చైతన్య పరుస్తూ లాల్ నీల్ ఐక్యతతో ముందుకు సాగుతూ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి రాజాసాహెబ్, బీఎల్ఎఫ్ డివిజన్ కమిటీ సభ్యులు నాగరాజు, కొమురయ్య, భాస్కర్, సాంబయ్య, సురేందర్, కొమురయ్య పాల్గొన్నారు.

'తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన కేసీఆర్'

పర్వతగిరి: సీఎం కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోదీకి తాకట్టు పెట్టి తన స్వార్థ అధికార దాహానికి తెలంగాణ ప్రజలను బానిసలుగా మార్చుతున్నాడని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్‌గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని, కేసీఆర్ పాలనలో ఏ వర్గాలు సంతృప్తిగా లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ భారీ ప్రణాళికతో ఎన్నికల్లో దిగబోతుందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అంతర్గత రహస్య ఒప్పందాలతో ఎన్నికల్లో ప్రజల్లోకి వస్తున్నాయన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పేరుకుపోయిందని, కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా బూత్‌లో ఉన్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరైనా.. భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గంలో కొత్త వారిని, యువకులను పార్టీలోకి తీసుకొచ్చే విధంగా యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కోరారు.

కృతజ్ఞతా ర్యాలీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట: నర్సంపేట ప్రాంతానికి మెడికల్ కళాశాల మంజూరుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఈనెల 6వ తేదీన నిర్వహించే కృతజ్ఞతా ర్యాలీ, సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గడ్డమీది బాలకృష్ణ, బీఆర్ఎస్‌వీ డివిజన్ కన్వీనర్ సదిరం వినయ్, ఎంఎస్ఎఫ్ మంచాల హరినాథ్ కోరారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం నిర్వహించిన విద్యార్థి సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. నర్సంపేట డివిజన్‌లో అన్ని వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతోపాటు ఇటీవల కాలంలో నర్సంపేట ప్రాంతానికి మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి కాలేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.183కోట్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ర్యాలీలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిద్ధు రాహుల్, ద్రావిడ్, తేజ, ప్రణయ్, శ్రీకాంత్, వినయ్‌కుమార్, రఘు, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏవీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

● జెడ్పీటీసీ బానోతు పత్తి నాయక్

చెన్నారావుపేట: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, న్యాయవాది, చెన్నారావుపేట సొసైటీ వ్యవస్థాపకుడు అర్శనపల్లి వెంకటేశ్వరరావు (ఏవీఆర్) ఆశయ సాధనకు కృషి చేయాలని జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని పాత సొసైటీ భవనం వద్ద అర్శనపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, సర్పంచ్ కుండె మల్లయ్య, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, ఎంఎ గఫ్ఫార్, జంగిలి బాబు, మజ్జిగ రాంబాబు, బానోతు పుల్‌శంకర్, మహేందర్ రెడ్డి, నరేందర్, సీతఊ చిట్టి రవి, సలీం, రాఘవులు, కట్టయ్య, రమేష్, తదితరులు ఉన్నారు.

ముగ్దుంపురంలో..



ముగ్దుంపురంలో..

నర్సంపేట రూరల్ : ముగ్దుంపురంలోని శ్రీరామ విత్తన సహకార సంఘం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి ప్రభాకర్, పాలకవర్గ సభ్యులు గోపు జయపాల్‌రెడ్డిలు హాజరై వెంకటేశ్వర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు




గుడుంబాను చూపుతున్న ఎస్సై పరమేష్

దుగ్గొండి: గుడుంబాను తయారు చేసినా, విక్రయించినా ఉక్కు పాదం మోపుతామని ఎస్సై జక్కుల పరమేష్ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పెట్రోలింగ్ నిర్వహించారు. చంద్రయ్యపల్లి గ్రామ శివారులో 40 లీటర్ల గుడుంబా రవాణా చేస్తూ నల్లబెల్లి మండలం శనిగరం గ్రామానికి చెందిన గుగులోతు బుద్ధ నాయక్ పట్టుబడ్డాడు. దీంతో గుడుంబా, బుద్ధ నాయక్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. రెండు నెలల కాలంలో మండలంలో 15 ప్రాంతాల్లో గుడుంబాను పట్టుకుని కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా రూ.2లక్షల పూచీకత్తుతో విడుదల చేశారని తెలిపారు. కార్యక్రమంలో పీసీలు కేశవమూర్తి, రాకేష్, నాగరాజు పాల్గొన్నారు.

డబ్బాల తొలగింపు వివాదాస్పదం

పరకాల: పట్టణంలోని శ్రీమహంకాళి ఆలయ ప్రాంగణంలోని డబ్బాల తొలగింపు వివాదాస్పదంగా మారింది. మంగళవారం తెల్లవారుజామున మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసు బందోబస్తుతో డబ్బాలను బలవంతంగా తొలగించడంతో డబ్బాల వ్యాపారస్తులు రోడ్డున పడ్డారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబాలను రోడ్డున పడేయొద్దని డబ్బాల చిరు వ్యాపారులు అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారమే మున్సిపల్ కమిషనర్ డబ్బాలను తొలగించినట్లు స్పష్టం అవుతుందన్నారు. దళితులను ఎమ్మెల్యే పట్టించుకోరని ఆరోపించారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న డబ్బాలను తొలగించకుండా దేవాలయ ప్రాంగణంలోని డబ్బాలు తొలగించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న ధర్మారెడ్డికి డబ్బాల వ్యాపారస్తులు దండాలు పెట్టకపోవడంతోనే డబ్బాలు తొలగిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు తొత్తుగా మారిన కమిషనర్‌కు రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ కొలను పాక భద్రయ్య, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, వెంకటస్వామి, రంజిత్, నిరంజన్ పాల్గొన్నారు.

కాట్రపల్లిని శాయంపేటలోనే కొనసాగించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామాన్ని కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలంలో కాకుండా శాయంపేట మండలంలో కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆర్డీఓ శ్రీనివాస్‌కు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి మంగళవారం వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామ ప్రజల అభిప్రాయాన్ని సేకరించాలని కోరారు.

'గృహలక్ష్మి' పేరుతో మరోసారి మోసం

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



తీగరాజుపల్లిలో మాట్లాడుతున్న భిక్షపతి

సంగెం: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే మళ్లీ గృహలక్ష్మి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విమర్శించారు. మండలంలోని తీగరాజుపల్లిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీప్రసాదరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భిక్షపతి మాట్లాడారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ జారీ అవుతున్న తరుణంలో గృహలక్ష్మి పథకం అంటూ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్నారని అవి ఎంపీడీఓ ఇస్తున్నవా లేక ఎమ్మెల్యే సొంతంగా చల్లా ఆఫీస్ నుంచి డౌన్‌లోడ్ చేసి ఇస్తున్నారా.. అని ప్రశ్నించారు. మండలంలో ఎంత మందికి ఇళ్లు మంజూరు చేశారో బహిర్గతం చేయడం లేదన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న పాత టీడీపీ, కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలకే దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు ఇస్తూ.. అర్హులైన పేదలకు ఇవ్వడంలేదన్నారు. తీగరాజుపల్లిలో అసైన్డ్‌భూముల్లో ఓపెన్‌కాస్టును తలపించే విధంగా అక్రమంగా మొరం తరలిస్తున్నారన్నారు. బీజేపీ నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాదరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు రహమతుల్లా, గొర్ల కాపర్ల సంఘం అధ్యక్షుడు చేరాలు, రంగరాజు కృష్ణ, చంద్రమౌళి, సతీష్, వీరయ్య, వెంకట్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి

రాయపర్తి: అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి, మండల భూస్వశక్తీకరణ ఇన్‌చార్జ్ పిట్టల రాజు పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు వడ్లకొండ రవి అధ్యక్షతన మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ బూత్‌స్థాయి సమీక్షా సమావేశంలో రాజు మాట్లాడారు.

బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి గడపకు తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం నరేందర్, నూనె అనిల్, శ్రావణ్‌కుమార్, నవీన్, ప్రశాంత్, ప్రభాకర్, గణేష్, అశోక్, రాజు, రాజశేఖర్, ప్రవీణ్, ప్రకాష్, భాస్కర్, సందీప్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపై సర్వే పరీక్షలు



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న రవికుమార్

నెక్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఈఏఎస్(రాష్ట్ర సాధన సర్వే పరీక్షలు) నిర్వహణపై విద్యాశాఖ దృష్టి సారించిందని మండల నోడల్ అధికారి రవికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని అప్పల్‌రావుపేట ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి, మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన అంశాలపై పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 3న నిర్వహించే జాతీయ సర్వే పరీక్షకు సిద్ధంగా ఉండాలని సూచించారు. హెచ్ఎం రవీందర్, సుధాకర్, జాన్ నాయక్, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, రవీంద్రనాథ్, శోభారాణి, నరేందర్ పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే మైదానాల ఏర్పాటు

శాయంపేట : క్రీడాలను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలను ఏర్పాటు చేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయలకు మంజూరైన క్రీడా కిట్లను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆమె మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సాంబరి వినోద్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ ఇన్సూరెన్స్ నుంచి మంజూరైన రూ. 2లక్షల చెక్కును అందించారు. ఈ ఎంపీపీ తిరుపతి రెడ్డి, గుర్రం అశోక్, గంగుల మనోహర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, రాజేందర్, విష్ణువర్ధన్ రెడ్డి, సదయ్య, సదానందం పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి దీక్షలు ప్రారంభం



దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

గీసుకొండ: మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మంగళవారం పలువురు భక్తులు స్వామివారి దీక్ష స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం వరకు ఆలయం వద్ద దీక్షలను స్వీకరించొచ్చని, 40 రోజులపాటు నిష్ఠగా ఉండాలని ఆయన తెలిపారు.

ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తా..

● రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట: రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యు డు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ ఎన్నికల కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. తనకు ప్రజల ఆశీర్వాదం ఉందని, అభివృద్ధి లక్ష్యంగా పని చేసిన తనను ప్రజలు గెలిపిస్తారనే నమ్మకం ఉందని ప్రకాశ్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ఎన్నికల కమిటీ శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తే గెలుపు సాధ్యమని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. కేసీఆర్ పాలనలో భంగపడిన ప్రజానీకం బీజేపీ వైపు చూస్తోందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతోనే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. అవినీతిమయమైన కేసీఆర్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, అభివృద్ధి ఎజెండాగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఎన్నికల కమిటీ కష్టపడి పని చేసి అధికార బీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

సంగెం: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కళావతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు సమగ్ర నివేదికతో, సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బుచ్చిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

రాయపర్తి: మండలంలోని పెర్కవేడు, వెంకటేశ్వరపల్లి, కొండూరు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందినవారి కుటుంబాలను మంగళవారం బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం మండలంలోని సూర్యతండాలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పూస మధు, సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, ఎంపీటీసీ అనూషరాజబాబు, బొమ్మెర వీరస్వామి, రాజు, సర్పంచ్ అమ్మిమాంజ్య, ఎంపీటీసీ వెంకన్న, జాజునాయక్, వసుంధర్, బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి పరామర్శ

ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి ఇటీవల మృతిచెందగా మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీపీని పరామర్శించారు. బుచ్చిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్, ఏపీఓ కుమార్‌గౌడ్, పంచాయతీకార్యదర్శులు, సర్పంచ్‌లు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, కోదాటి దయాకర్‌రావు, లేతాకుల యాదవరెడ్డి, రవీందర్‌రెడ్డి, నవీన్, జగన్, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.